క్లుప్తంగా

దురదకుంటలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీపీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని దురదకుంట గ్రామ సచివాలయంలో నూతనంగా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డీఎల్‌డీఓ శంకర్, ఎంపీపీ మారుతమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాజీ శుక్రవారం దురదకుంట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం సచివాలయం ద్వారా మరిన్ని సేవలు అందించాలని మండలంలోని రూరల్ పరిధిలో మొదటగా ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డీఎల్‌డీఓ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు బ్రహ్మయ్య, వన్నూరుస్వామి, రవి, రామాంజనేయులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు వేంకటరమణస్వామి, గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఈఓ శ్రీనివాసులు, ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి శుక్రవారం తెలిపారు. భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

కళ్యాణదుర్గం: స్థానిక పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృతి యూనివర్శిటీలో వేదాంత డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ యస్.తనూజ్ విష్ణు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం చేపడతామన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనదల్చిన వారు రూ.2116 చెల్లించాలన్నారు.

నేడు చౌడేశ్వరి జాతర

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లిలో శనివారం చౌడేశ్వరి జాతర నిర్వహించనునట్లు దేవదాయశాఖ ఈఓ దేవదాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ తెలిపారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి

కళ్యాణదుర్గం: సీనియర్ సిటిజన్లు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని జనరల్ మేనేజర్ మురళీకృష్ణ సూచించారు. స్థానిక పెన్షనర్ల భవనంలో శుక్రవారం బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు నిబంధనలు, వడ్డీ రేట్లు, నిర్దిష్ట కాల పరిమితిపై ఆయన వివరించారు. హౌసింగ్, వాహన, వ్యక్తిగత రుణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివ ప్రసాద్, తిప్పేస్వామి, నాగరాజు, అంజినప్ప, సీసీరెడ్డి, పాండురంగ, నరసింహులు, రామన్న, వన్నూరుస్వామి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఒంటిమిద్ది అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో గూబనపల్లి, దొడగట్ట, ఒంటిమిద్ది అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కేంద్రాలను తప్పక తెరిచి ఉంచాలన్నారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు భోజనం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి హోదాలో వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లావణ్య, సిబ్బంది జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లి, గుండ్లపల్లి మధ్య రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నక్కలపల్లికి చెందిన విద్యుత్‌శాఖ ఉద్యోగి వెంకటేశ్‌నాయక్, రైతు భగవాన్‌రెడ్డితో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. ఎదురుగా నక్కలపల్లికి చెందిన సంజప్ప ద్విచక్ర వాహనంలో వస్తూ ఢీకొన్నాడు. ప్రమాదంలో సంజప్ప తలకు తీవ్రగాయాలు కాగా వెంకటేశ్‌నాయక్‌కు చేయి విరిగింది. రైతు భగవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటాం

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుల హర్షం
- మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డికి అపూర్వ స్వాగతం



నా పేరు వన్నూరు స్వామి. ఊరు రాయదుర్గం మండలం జుంజురాంపల్లి. నేను టీడీపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందా. తండ్రిని రేషన్ కార్డులో నా కుటుంబం, తల్లి రేషన్ కార్డులో నా తమ్ముడి కుటుంబం ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రెండు కార్డులకూ కలిపి మాకు రూ.2,50,897 లబ్ధి చేకూరింది. మంచి చేసిన ప్రభుత్వాన్ని అభినందించాలంటూ ఇంటి వద్దకు వెళ్లిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి పండ్లు అందజేసి సంతోషం వ్యక్తం చేశాడు.



బ్రహ్మసముద్రం: మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



రాయదుర్గం రూరల్: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బ్రహ్మసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాతే మాకు మంచి జరుగుతోందని, కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు తెలిపారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలోని గుడిపల్లి, గొల్లలదొడ్డి, బుడిమేపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ, మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధిపై మంత్రి ఆరా తీశారు. సంక్షేమ పథకాలు ఆదుకున్నాయని , జగనన్న ప్రభుత్వం పట్ల మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. అలాగే గుడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీఎస్ ఆధ్వర్యంలో మంత్రి గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ వెంకటనాయుడు, ఏపీఓ అప్పస్వామినాయుడు, జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీపీ కంభం చంద్రశేఖర రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు , జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు సునందమ్మ, వెంకటేష్ నాయక్, నాయకులు పాలబండ్ల చంద్ర శేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, జిన్నా మల్లి, నజీర్, బాధపల్లి, ఇస్మాయిల్, గజేంద్ర, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

రాయదుర్గం రూరల్: అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు మీ చల్లని దీవెనలు కావాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని జుంజురాంపల్లిలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి , జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జునతో కలిసి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబం లబ్ధి పొందిన వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేసి మంచి చేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందేవని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నిరంతరం రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, ఎంపీటీసీ మతం సురేష్ , మండల కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా, రేకులకుంట సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, మాజీ ఎంపీపీ మతం కుమారస్వామి, నాయకులు శివారెడ్డి, జుంజురాంపల్లి మతం మంజునాథ, జగదీష్, మహేష్ స్వామి, హనుమంతరాయుడు, కొల్లన్న, కెంచానపల్లి బుజ్జి, మురారి, నారాయణ నాయక్ , మలకాపురం నాగరాజు, తహసీల్దార్ మారుతి, ఈఓపీఆర్డీ రఘురామారావు, విద్యుత్ ఏఈ బాలచంద్ర, హౌసింగ్ ఏఈ జయచంద్ర సచివాలయ సిబ్బంది , వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధుల నివారణ

బొమ్మనహాళ్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి గీతాభార్గవి అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురంలో మలేరియా, డెంగీ, చికున్ గన్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గన్యా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. రాత్రిపూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, అలివేలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని వివిధ గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలు శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్య చికిత్సలు అందజేశారు. అనంతరం తొట్టెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అలాగే మురికి గుంతల్లో వేస్ట్ ఆయిల్ చల్లించి, బ్లీచింగ్ పౌడర్ వేయించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఉరవకొండ రూరల్: మండలంలోని వెలిగొండ గ్రామంలో సర్పంచ్ వీరాంజనేయులు, వైస్ ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. త్వరలో నిర్వహించే సిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని, సమస్య ఉన్న ప్రాంతంలో కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగప్ప, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

ఉరవకొండ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఉరవకొండ నియోజకవర్గంలో రైతులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. వంద కోట్ల మేర లబ్ధి జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకే వ్యవస్థను ప్రవేశపెట్టి రైతుల ముగింటకే ఎరువులు, విత్తనాలు అందిస్తోందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోని వ్యవసాయ రంగంలో నూతన వంగడాలను పండించడానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఏఓ శశికళ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేష్, ఎంపీపీ చందాచంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, రైతు సంఘం నాయకుడు అశోక్ పాల్గొన్నారు.



ఉరవకొండ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ. చిత్రంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్



కంబదూరు: మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ బాబురెడ్డి

ప్రభుత్వ ఆశయం మేరకు పనిచేయండి

కంబదూరు: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ ఆశయం మేరకు వ్యవసాయ శాఖ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, వైస్ ఎంపీపీ బీమేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ జాఫర్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ తప్పనిసరి

బెళుగుప్ప: రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న సూచించారు. శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ పృథ్వీసాగర్ ఆధ్వర్యంలో అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, జెడ్పీటీసీ మమత, తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, సలహా మండలి సభ్యులు, ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు, ఎంఐఓ మల్లేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు త్రిలోక్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఏఏలు పాల్గొన్నారు.

బిల్లుల మంజూరులో అపోహలు వీడండి



మాట్లాడుతున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వ

వజ్రకరూరు: అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరులో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, బిల్లుల మంజూరుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అంశాలు, చేపట్టాల్సిన పనులు, వాటి పురోగతి తదితర వాటిపై ఆయన అధికారులు,ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 75 పనులు గుర్తించగా.. ప్రభుత్వం రూ.రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను వెంటనే ప్రారంభించి సత్వరమే పూర్తిచేయాలని ఆయన సూచించారు. ప్రతి పనికీ వెంటనే బిల్లులు మంజూరవు తాయని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే 'జల జీవన్ మిషన్ కింద' నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరైందని, ప్రతి ఇంటికీ ఉచితంగా కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీ సుశీలా రాణి, మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, శివాజీనాయక్, లక్ష్మయ్య, కురుబ తిరకమ్మ, ఉమామహేశ్వరి, భూమా కమలమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిబాయి, సుంకులమ్మ, కవితా బాయి, సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

అధైర్యపడవద్దు, అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని ఎన్ఎ న్‌పీ తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హేమ్లానాయక్ భార్య వి.సాలమ్మ గుండెపోటుతో మూడురోజుల క్రితం మృతిచెందింది. అలాగే మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపతిరాజు ఐదురోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. వజ్రకరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘుపతి తల్లి లక్ష్మీదేవి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'ఆర్‌వైఎస్‌ఎల్' ఫైనల్ పోటీలు

రాయదుర్గంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన రాయదుర్గం యూత్ స్పోర్ట్ లీగ్(ఆర్‌వైఎస్‌ఎల్)–2 సంక్రాంతి క్రీడా పోటీలు తుది అంకానికి చేరుకున్నాయి. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మూడో స్థానంలో క్రికెట్ విజేత కోసం నిర్వహించిన మ్యాచ్‌లో గౌనికుంటపై ఆర్డీజీ శాంతి నగర్ బీ జట్టు గెలుపొందింది. అంతకుముందు మ్యాచ్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి క్రీడాకారులతో కలసి కాసేపు క్రికెట్ ఆడి ప్రోత్సహించారు. సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కబడ్డీ, వాలీబాల్, హాకీ సెమీ ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి.



క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, తనయుడు కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

శనివారం నిర్వహించే ఫైనల్ పోటీలకు జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి హాజరవుతున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. అన్ని క్రీడల్లో విజేతలకు ప్రోత్సాహక, నగదు బహుమతులు ఎస్పీ అందజేస్తారన్నారు.

సంక్రాంతి సందండి



పట్టణంలో రంగుపొడి విక్రయాలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. పండుగ సామాగ్రి కొనుగోళ్లతో పట్టణంలో పలు వీధులు, అంగళ్లు జనంతో కిటకిటలాడాయి. పాత టవర్‌క్లాక్ సర్కిల్, పాత బస్టాండ్ ఏరియా, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డులో దుకాణాల్లో సందడి కనిపించింది. పట్టణంలోని వీధుల్లో ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి.

సీసీ రోడ్డుకు భూమిపూజ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నాగుల బావి ఎదురు(11వబ్లాక్)గా ఎంపీటీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎం పీపీ సుశీలారాణి శుక్రవారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధురెడ్డి, ఎంపీటీసీ ఫిరోజ్‌బాబు, వార్డు సభ్యుడు మల్లికార్జునరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి సత్య, మైనార్టీ విభాగం కార్యదర్శి మున్నా, డైరెక్టర్ బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ఉరవకొండ: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాతబస్టాండ్ సమీపంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ గణేష్‌బాబు, నజీర్ అహ్మద్, సభ్యులు పీజీఎస్ నూర్‌మహ్మద్, జీకే శ్రీధర్, విశ్వనాథ్, జయన్న పాల్గొన్నారు.

మొదలైన వాటర్‌షెడ్ పనులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు గ్రామాన్ని సందర్శించి పనులకు భూమి పూజ సంగతి విదితమే. శుక్రవారం పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, రాక్ ఫీల్డ్ డ్యామ్స్ (ఆర్‌ఎఫ్‌డీ) పనులను ప్రారంభించారు. వాటర్‌షెడ్ పీఓ శ్రీవిద్య, టీఓ శేషు, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి పనులను పర్యవేక్షించారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటిమట్టం పెరుగుతోంది. డ్యాంలోకి హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా 324 క్యూసెక్కులు, హెచ్చెల్సీ లింక్ చానల్ నుంచి 39, ఎగువ భాగం నుంచి 178 క్యూసెక్కుల చొప్పున నీరు చేరుతోంది. ఈ నెల ఏడు నుంచి ఏపీ జెన్‌కో జల విద్యుత్ తయారీకి ఇరిగేషన్ అధికారులు నీటి సరఫరా నిలిపేశారు. ప్రస్తుతం ధర్మవరం కుడి కాలువకు రోజూ 135 క్యూసెక్కులు, తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. అవుట్‌ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో శుక్రవారం నాటికి డ్యాంలో 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు.

భూహక్కు పత్రాల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోయలపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 50 మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ అనితబాయి, సర్వేయర్ భవాని, రైతులు పాల్గొన్నారు.

కచ్చితమైన కొలతలతో భూ హక్కుపత్రాలు

శెట్టూరు: రీసర్వేలో కచ్చితమైన కొలతలతో భూ హక్కుపత్రాలు మంజూరు చేస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అడవిగొల్లపల్లిలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇటీవల అధికారులు గ్రామంలో భూ రీ సర్వే నిర్వహించి, రైతులకు భూ హక్కు పత్రాలు మంజూరు చేశారు. అందులో హద్దులు సరిగా లేవంటూ పలువురు రైతులు ఫిర్యాదు చేయడంతో.. రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ రైతులు గతంలో కచ్చితంగా లేని కొలతలతో భాగ పరిష్కారాలు చేసుకుని, పంటలు సాగు చేసేవారన్నారు. ప్రస్తుతం రీసర్వేలో కచ్చితమైన కొలతలతో భూహక్కు పత్రాలు మంజూరు చేశామన్నారు. రికార్డులు తప్పుగా ఉంటే పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, వీఆర్‌ఓ గంగన్న, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కాపు భారతి జన్మదిన వేడుకలు

రాయదుర్గం: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కుటుంబ సమేతంగా పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం విప్ కార్యాలయం వద్ద వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కాపు అభిమానుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డి, కోడలు అలైఖ్యరెడ్డితో కలసి విప్ దంపతులు స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు అందజేశారు. అలాగే బళ్లారి రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులందరికీ దుప్పట్లు, పండ్లు, తినుబండారాలను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద, క్రీడాకారులందరికీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



అనాథాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కాపు దంపతులు

నియోజకవర్గం వ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్ పాలక పక్షంతో పాటు పార్టీ అనుబంధ సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

డి హీరేహాళ్ (రాయదుర్గం): రబీలో సాగు చేసిన పంట పొలాల్లో సస్యరక్షణ చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమని రాయదుర్గం వ్యవసాయ ఉప సంచాలకుడు (ఏడీఏ) లక్ష్మానాయక్ సూచించారు. శుక్రవారం డి హీరేహాళ్ ఆయన పర్యటించి వేరుశనగ పంట పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్‌బీకేలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

కణేకల్లు: మండలంలోని గరుడచేడు, తుంబిగనూరు గ్రామాల్లో రబీ సీజన్ కింద సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. వరికి ఆశించే వివిధ రకాల తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఏ రైతులకు వివరించారు.

కూడేరు: సస్య రక్షణ పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందని మండల వ్యవసాయాధికారిణి నవత సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రకోడులో వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు చేపట్టారు. అనంతరం కూడేరులోని వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి అగ్రి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీపీఏ, ఎంపీఈఓలు, సలహా కమిటీ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

బొమ్మనహాళ్: పీఎం కిసాన్ పథకం కోసం ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసుకున్న రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఏఓ అహమ్మద్ బాషా, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఏఈఓ గోపాల్, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ల విడుదల

ఉరవకొండ: వజ్రకరూరు మండలం గూళపాల్యం గ్రామంలోనిఉమామహేశ్వర ఆశ్రమంలో ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే బృహత్ నందీశ్వర శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమామహేశ్వర ఆశ్రమం 28వ గురు పీఠాధిపతి ప్రణవానందగిరి గురుస్వామిమితో కలసి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి విడుదల చేశారు. గురు పీఠాధిపతి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద ఎత్తైన నందీశ్వర విగ్రహన్ని గూళపాల్యంలో ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే విశ్వను పీఠాధిపతి ఆహ్వానించారు. లత్తవరం సర్పంచ్ పాలడుగు వంశీ, వైఎస్ ఎంపీపీ నరసింహులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం చెరువుకోడి సమీపంలో నాయకుల చిన్నబొమ్మయ్య గుడిసె విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెలో మంటలు చెలరేగాయి. నిద్రిస్తున్న కుటుంబసభ్యులు తేరుకుని గట్టిగా కేకలు వేస్తూ బయటకు రావడంతో నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు మంటలు ఆర్పడంతో ఆస్తి నష్టం జరగలేదు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701